క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కలకడ : మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారం అందించి ఆరోగ్యసూత్రాలు తెలియజేయాలని ఎంపీపీ శ్రీదేవి ఆదేశించారు. బుధవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి చిన్నారుల హాజరు, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి

మదనపల్లె సిటీ: ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా ఉర్దూ మానిటరింగ్ అధికారి షేక్ మహ్మద్ హాషిం ఉపాధ్యాయులను కోరారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యారంగంలో అనునిత్యం చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయుల తమ బోధనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వపరంగా అందజేయబడుతున్న సౌకర్యాలు పథకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలో 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం ఆర్టీసీ నల్లగుట్టలో దాడులు నిర్వహించారు. నల్లగుట్టకు చెందిన పి. వెంకటరమణ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదే ప్రాంతానికి భూదేవిపై కూడా కేసు నమోదు చెసినట్లు చెప్పారు. ఈ దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది లోకేష్, సుదాకర్, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

నేటి నుంచి నవోదయ క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురు, శుక్రవారాల్లో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్ , ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. గురువారం మొదటి రోజు జరిగే కార్యక్రమాన్ని ఆర్డీవో ఎం.ఎస్.మురళి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్ మీట్‌కు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నవోదయ విద్యార్థులు పాల్గొంటారన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



కేవీపల్లె : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గర్నిమిట్టలో పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పీర్లను బుధవారం ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన హిందూ ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

వృద్ధుల సంరక్షణ కుటుంబ బాధ్యత

పీలేరు : వృద్ధుల సంరక్షణ కుటుంబ బాధ్యతగా తీసుకోవాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య దశలో మంచానికే పరిమితమైన వారి ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, మానసిక స్థితి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం రేణుక, సీహెచ్‌వో రాజేశ్వరి, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ సర్వేలో పూర్తి వివరాలు నమోదు చేయాలి



సర్వే వివరాలు పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు

గుర్రంకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకొనే ప్రతి విద్యార్థిరుల వివరాలు ఎడ్యుకేషన్ సర్వేలో నమోదు చేయాలని జిల్లా సర్వే అధికారి జయరాజ్ అన్నారు. బుధవారం స్థానిక తెలుగు, ఉర్దూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా కళాశాలల్లో ఎంతమంది విద్యార్థులు చదువుకొంటున్నారు, వారి వివరాలు ఎడ్యుకేషన్ సర్వేలో భాగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారా అన్న వివరాలపై ఆరా తీశారు. వివరాలు సక్రమంగా లేకపోతే పదవ తరగతి చదివి చదువు మానేసిన డ్రాప్ అవుట్స్ వారిని గుర్తించలేమన్నారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథ్, మణికుమార్, నిస్సార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యవరం లేఅవుట్‌కు తొలగిన అడ్డంకులు

- 1,150 మంది లబ్ధిదారులకు గృహయోగం
- నేటి నుంచి సరిహద్దు మార్కింగ్
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే, ఆర్డీఓ, హౌసింగ్ సిబ్బంది



ప్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ మురళి

మదనపల్లె : ఆరోగ్యవరం లేఅవుట్‌లో ప్లాట్ల కేటాయించిన పట్టాదారులకు అడ్డంకులు తొలగిపోయాయి. కోర్టులోని కేసు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఆరోగ్యవరం లేఅవుట్‌లో ప్లాట్ల కేటాయింపుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్. మురళీ, హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ రామస్వామిరెడ్డి తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాట్లకు సంబంధించి మార్కింగ్, సరిహద్దు రాళ్ల నాటేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన సహాయసహకారాలు అందించాల్సిందిగా రెవెన్యూ, హౌసింగ్, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ... నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్లు లేని వారు ఉండకూడదనే లక్ష్యంతో దేశచరిత్రలోనే ప్రథమంగా రాష్ట్రంలో లక్షలాది నిరుపేదల కలలను సాకారం చేస్తూ మొత్తంగా 30.75లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి పెద్దసంఖ్యలో ఇళ్లనిర్మాణాలు జరిగి వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో కొత్త ఊళ్లు ఏర్పాటవుతున్నాయన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 15,000కు పైగా ఇళ్లు కేటాయించామన్నారు. గృహనిర్మాణపనులు పూర్తి కావస్తున్నాయని, త్వరలోనే వీటన్నంటిలో గృహప్రవేశాలు చేయించి పేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎంగా జగనన్న చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆరోగ్యవరం లేఅవుట్‌కు సంబంధించి 1,250 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. జియో ట్యాగింగ్ పూర్తయి పనులు ప్రారంభించే క్రమంలో దీనికి సంబంధించి ఆరోగ్యవరం మెడికల్ సొసైటీ కోర్టులో కేసు వేయడంతో స్టే విధించడం... తర్వాత ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో అడ్డంకులు తొలగిపోయాయన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ప్లాట్లలో ఇకపై నిర్మాణాలు ప్రారంభించవచ్చని, హౌసింగ్, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటూ నిర్మాణపనులకు సహకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పోతబోలునాగరాజ, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల సంక్షేమమే సీఎం ధ్యేయం

గడప, గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: పార్టీలకతీతంగా పేద వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం అయన మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీలో పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్ళి ప్రజా సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా అయా శాఖల అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైనా ఇలాంటి అభివృద్ధి జరిగిందా, సంక్షేమ పథకాలు మీ ఇంటి వద్దకే వచ్చేవా అంటూ ప్రజలను సూటిగా ప్రశ్నించారు. టీడీపీకి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బేరీజు వేసుకుని రాబోవు రోజుల్లో కూడా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గతంలో కన్నా జగనన్న ప్రభుత్వంలోనే తాము హాయిగా ఉన్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా అలాంటి సీఎం పాలనలో ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే భాగ్యం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ స్థంభాలు మార్చాలని, సిమెంటు రోడ్లు, మురికి కాలువలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే వాటిని అమలు చేయాలని అయా శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మండల, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, కొండా సిద్దార్థ, డ్రిప్ రమణ, సురేంద్ర యాదవ్, జక్కల రామాంజులు, షేక్ ప్యారీజాన్, చంద్రశేఖర్,సుబ్బరాం, రియాసత్ అలీఖాన్, పప్పు రాజారెడ్డి, పట్టెరిక శోభాతో పాటు స్థానిక నాయకులు ఖాదర్‌వలి, మెకానిక్ చంద్ర, వెంకట నారాయణ, జయరాంరెడ్డి, సింగాడి రవి, శ్రీనివాసులురెడ్డి, సుబ్బా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

మద్దయ్యగారిపల్లి పంచాయతి అంగడివారిపల్లికి చెందిన ఐదు కుటుంబాలు టీడీపీ నుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి పనులు, అమలౌతున్న సంక్షేమ పథకాలకు తాము ఆకర్షితులై పార్టీలోకి చేరామని మండెం కుటుంబాలకు చెందిన రమనప్ప, ఓబులేసు, ఆది, వినోద్, ఉత్తన్నలు ఎమ్మెల్యే ఎదుట తెలిపారు.

దివ్యాంగులను ఆదుకుంటాం

– మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఇటీవల పట్టణం ఇంటింటి పర్యటన సందర్భంగా పలువురు దివ్యాంగులు వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు కావాలని కోరారు. దీంతో బుధవారం వినికిడి యంత్రాలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సహకారంతో పది వినికిడి యంత్రాలు, పది ట్రైసైకిళ్లు త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, కాలనీ చిన్న, షాకీర్, నాగార్జున, సునీల్‌రెడ్డి, కాటయ్య, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు సహకరించాలని వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న మండల నాయకులు

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన పురాతన చరిత్ర కలిగిన శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతల రమేష్ కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.మురళీనాథ రెడ్డి బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. కుప్పం పర్యటనలో ఉన్న మంత్రిని బుధవారం కలిసిన వీరు ఆలయాన్ని సందర్శించి, జీర్ణోద్ధరణకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని కోరారు.

ఆదర్శవంతంగా విద్యావిధానం

కలికిరి: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఆదర్శవంతంగా విద్యావిధానం అమలవుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నరేష్ అన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వంపై బురదచల్లడానికి అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. నాడు–నేడు పథకంతో కార్పొరేటు పాఠశాలల తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నేడు ప్రజల ముందు కనపడుతున్నాయని, ప్రజలు అసత్య ఆరోపణలను నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్షాలు విద్యావిధానంపై విషం చిమ్మడం మానుకోవాలన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

తంబళ్లపల్లె: స్థానిక వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న దంతవైద్యులు బాబాఫకృద్దీన్, స్టాఫ్‌నర్సు నీలిమ, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, అటెండర్ చలపతిలను బుధువారం డాక్టర్లు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. మెడికల్ ఆఫీసర్ పావణి మాట్లాడుతూ దంత వైద్యులు డాక్టర్ బాబాఫకృద్దీన్ కోవిడ్ సమయంలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక శిక్షణ పొంది ప్రమాదకర సమయంలో విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందడం హర్షణీయమన్నారు. వైద్యులు వెంకటరామయ్య, విక్రాంత్‌రెడ్డి, రిచర్డ్స్, రూప, షబానాఫాతిమా, తేజశ్వి, సుమలత పాల్గొన్నారు.

పక్కాగా ఈ–క్రాప్ నమోదు చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి

కలికిరి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పక్కాగా ఈ–పంట నమోదు ప్రక్రియ చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి అన్నారు. కేవీకే కార్యాలయంలో పీలేరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆర్బీకే సిబ్బందికి ఈ–పంట నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట వివరాలను ఈ–క్రాప్ యాప్‌లో నమోదు చేసి రసీదులు అందజేయాలని సూచించారు. అలాగే వ్యవసాయశాఖ ద్వారా అమలులో ఉన్న పథకాలను ఆర్బీకే సిబ్బంది రైతులకు ఎప్పటికప్పుడు తెలియచేయాలన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా చేయడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ ఆర్బీకే సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం కేవీకే ప్రదర్శనా క్షేత్రాలైన వేరుశనగ విత్తనోత్పత్తి క్షేత్రం, పెరటికోళ్ళ పెంపకం, వర్మికంపోస్టు, భూసార పరీక్షా కేంద్రం, అజొల్లా యూనిట్, పాలీహౌస్, షేడ్ నెట్ నర్సరీలను అధికారులు సందర్శించారు. కార్యక్రమాలలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవికుమార్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోడేషావల్లి, కేవీకే కో–ఆర్డినేటర్ డా. పాండురంగ, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ వెంకట్రమణ

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ వెంకట్రమణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వైస్ ఎంపీపీ వెంకట్రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. వర్షా కాలం దృష్ట్యా పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ప్రతి మండలాభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ సమస్యల పరిష్కారానికి రూ.60 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ నిర్మల, వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, కోఆప్షన్ సభ్యులు మహబూబ్ బాషా, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగరాజ, కార్పొరేషన్ డైరెక్టర్లు అబ్దుల్ కలీమ్, నల్లంకి నరసింహులు, నరసింహులు, ఆర్బీకే చైర్మన్ నీళ్లభాస్కర్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపుపై జాగ్రత్తలు తీసుకోవాలి

తంబళ్లపల్లె: విద్యార్థులు కంటి చూపుపై జాగ్రత్తలు పాటించాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ అనుపమ తెలిపారు.వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో విద్యార్థులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి స్క్రీనింగ్ టెస్టు చేసి కంటి అద్దాలు అవసరం గల వారిని గుర్తించారు. బుధవారం వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు.

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం టీటీడీ ఆధ్వర్యంలో బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాముసే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని ఆకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

పెద్దతిప్పసముద్రం: స్థాని పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివాలయం సేవకుడు ననగరం పట్టాభ రామయ్య ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం చింతామణి సమీపంలోని ఎగవకోటలోని నరసింహ స్వామి ఆలయంలోని విగ్రహ ప్రతిమలను ఇక్కడకు తీసుకొచ్చి స్వాతి నక్షత్రం సందర్భంగా వేద పండితులు కన్నాస్వామి, పణితేజ స్వామిలు భక్తి శ్రద్ధలతో కల్యాణోత్సవంతో పాటు మహా మంగళహారతి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్గిల్ యోధులు..చిరస్మరణీయులు



నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. స్వతంత్ర భారత చరిత్రలో మన సైన్యం ఎంతో వీరోచితంగా పోరాడిన ఘట్టాన్ని అందరూ గుర్తు చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ సి. కమాల్ బాషా కోరారు. ఎన్‌సీసీ కేడెట్స్ కొవ్వొత్తులను ప్రదర్శించారు.

మదనపల్లె సిటీ: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్గిల్‌లో మృతి చెందిన సైనికులకు నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ దేశం కోసం సైనికులు తమ ప్రాణాలు సైతం ఫణం పెట్టి పని చేస్తున్నారన్నారు. యుద్ధరంగంలో వీరమరణం పొందిన సైనికులను స్మరించుకుని నివాళులు అర్పించారు.

సేవకు సలాం



ప్రతి ఇంటి తలుపు తట్టి సేవలు



బురకాయలకోటలో కరోనా పరీక్షలు చేయిస్తున్న వలంటీర్ షబాన (ఫైల్)

కరోన విజృంభిస్తున్న సమయంలో ప్రజలకు సహకరించేవారు కరువయ్యారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చే పరిస్థితులు లేవు. కరోన పరీక్షలు నిర్వహించడానికి వైద్య సిబ్బంది బురకాయలకోటకు వచ్చారు. కరోన లక్షణాలతో బాధపడుతున్న మా కుటుంబ సభ్యులకు వలంటీర్ షబాన ధైర్య చెప్పింది. ఉచితంగా కరోన పరీక్షలు చేస్తున్నారని తెలియజేసి దగ్గరుండి పరీక్షలు చేయించారు. అలాగే తన పరిధిలోని 50 కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తోంది. ప్రతినెలా 1వ తేదీన తలుపు తట్టి లబ్ధిదారులకు పింఛన్ అందిస్తోంది. జగనన్న సురక్ష, ఫీవర్ సర్వేలో చురుగ్గ పాల్గొని సేవలు అందింస్తూ శభాష్ అనిపించుకుంటోంది. లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే వారికి అవసరమైన అన్ని సేవలను వలంటీర్ల ద్వారా సీఎం వైఎస్ జగన్ నెరవేరుస్తున్నందుకు ప్రజలు హర్షస్తున్నారు.

– ములకలచెరువు

వలంటీర్లకు రుణపడి ఉంటాం



కరోన కష్ట కాలంలో వలంటీర్లు చేసిన సేవకు రుణపడి ఉంటాం. మా వీధిలో కరోన బాధితులు ఎక్కువగా ఉన్నారు. అధికారులు మా వీధిలో రాకపోకలు అధికారులు పూర్తిగా బంద్ చేశారు. ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి. మా వీధికి చెందిన వలంటీర్ మాకు అన్ని రకాల సేవలు అందించారు. కావాల్సిన నిత్యవసరకులు, మందులు ప్రతి రోజూ మ ఇళ్ల వద్దకే తెచ్చి ఇచ్చేవారు. వలంటీర్ సేవలను మరువలేము.

– ఎస్. ఫాతీమా, బురకాయలకోట, ములకలచెరువు మండలం

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. మండలంలోని మహల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మహల్ కస్బా, హరిజనవాడ, కూరాకులపల్లిలో రాష్ట్రమైనార్టి కార్పోరేషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటి పర్యటించి, నాలుగేళ్ళలో ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలపై విచారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా వలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థతో ఎలాంటి దళారీలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా అందచేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాలలో ప్రజలకు ఏదైలా లబ్ధి జరగాలంటే ప్రభుత్వా కార్యాలయాల చుట్టూ తిరగడంతో పాటు ఆ పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోవాల్సి ఉండేదని, అయినా అర్హులకు అన్యాయం జరిగేదన్నారు. ఇప్పుడు కులమతాలు, రాజకీయాలతీతంగా ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.7లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని వివరించారు. మహల్ కస్బా, హరిజనవాడ, కూరాకులపల్లిలో మురుగునీటి కాలువలు ఏర్పాటు, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్పు, తాగునీటి కుళాయిలు, జగనన్న కాలనీ ఇండ్లు, రేషన్‌కార్డులలో మార్పులు, చేర్పులు, సామాజిక ఫించన్లు, రెవెన్యూ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా శాఖల అధికారులు సమస్యలు నమోదు చేసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆహామొహిద్దీన్, సర్పంచ్‌లు తస్లీమారీయాజ్, వెంకటరెడ్డి, గంగయ్య, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎంపీటీసీ సభ్యులు సావిత్రి ప్రదీప్‌రెడ్డి, అల్లాబక్షు, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎస్టేడి హరి, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఇస్తియాక్ అహ్మద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ప్రమాద బీమా అందజేత

మండలంలోని పల్లవోలు గ్రామం పడమటపల్లి హరిజనవాడకు చెందిన ఎస్.నరేష్ ఇటీవల ప్రమాదంలో మరణించాడు. మృతుని భార్య డి.పద్మావతి వైఎస్సార్ బీమా పథకానికి దరఖాస్తు చేసుకుంది. పరిశీలించిన అధికారులు దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపారు. బాధితురాలికి ప్రభుత్వం వైఎస్సార్ భీమా నగదు రూ.5లక్షలు మంజూరు చేసి నేరుగా ఖాతాకు జమచేసింది. ఈ మేరకు బాధితురాలు పద్మావతి ఎమ్మెల్యే చింతలను కలిసి తన కుటుంబాన్ని ఆదుకున్నందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ కె. ధనుంజయలు

పీలేరు రూరల్ : ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కె. ధనుంజయలు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, పాఠశాలలకు, ప్రభుత్వ హాస్టళ్లకు బియ్యం సకాలంలో పంపిణీ చేయాలన్నారు. అలాగే మండలంలో 56 ప్రభుత్వ చౌకదుకాణాలు ఉన్నాయని, అన్ని షాపుల్లో ప్రభుత్వ నిర్ణీత ధరలకు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సరుకులు పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీటీలు సుబ్రమణ్యం, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పిల్లల బాల్యాన్ని రక్షించడంపై అవగాహన



మాట్లాడుతున్న ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ

మదనపల్లె సిటీ: పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా, పిల్లల బాలాన్ని రక్షించడంపై ఈనెల 26 నుంచి క్రై, ఫోర్డు సంస్థలు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ఫోర్డు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ వారం రోజల పాటు మదనపల్లె, పెద్దమండ్యం మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాలేజీలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. పిల్లలు మరింత అప్రమత్తంగా ఉంటూ అక్రమణ రవాణాకు గురికాకుండా ప్రతి ఒక్కరు వారిని, వారి పిల్లలను కాపాడుకోవాలని,అపరిచిత వ్యక్తులు, అనుమానస్పదంగా ఉన్నవారిని చూసినట్లయితే పోలీసు కంట్రోల్ రూము, దిశా హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్‌లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోర్డు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీధర్, మండల కోఆర్డినేటర్ రాధారాణి, సిబ్బంది నరసింహులు, అల్లాఫ్‌బాషా, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.